ఈదురుగాలులు.. వర్షం

పెంచికలపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. వర్ష బీభత్సానికి మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన తెలుగే పుల్లయ్య ఇంటి గోడ కూలి పోయింది. ఆ సమయంలో అక్కడ లేక పోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. అధికారులు నష్ట పరిహారం అంచనా వేసి సాయం అందించాలని బాధితుడు కోరాడు.

ఘనంగా తొలి ఏకాదశి


బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బెజ్జూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెజ్జూరు మండల కేంద్రంలోని రంగనాయక, శివాలయ, హనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలతో పాటు వివిధ గ్రామాల్లో భక్తులు తొలి ఏకాదశి సందర్భంగా పూజలు నిర్వహించారు. ఏకాదశి రోజు ఉపవాస దీలు చేపట్టి ఆలయల్లో మొక్కులు చెల్లించుకున్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి ఓంకార ఆశ్రమం, చింతలమానేపల్లి వీరాంజనేస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలను భక్త లు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయ స్వామి ఆలయంలో ఎక్కామా ప్రారంభించారు. ఓంకార ఆశ్రమం, రాధాకృష్ణ ఆలయాల్లో రాధా-కృష్ణలను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం తొలి ఏకాదశి పండగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, భక్తులు బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హరిసంకీర్తన నిర్వహించారు. అర్చకులు గంగు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్

బెజ్జూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని ఎపీసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్ అన్నారు. బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో ఆదివారం అంతర్జాతీయ సహకార సంఘం దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మాకే నామ్ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత సిబ్బంది తీసుకోవాలన్నారు. మొక్కలపైనే మానవాళి మనుగడ ఆధార పడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ మురీశ్వరి, డైరెక్టర్ శ్రీవర్ధన్, కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు జగ్గాగౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కెరమెరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌ను ధ్వంసం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా ఆదివారం పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడారు. మండల కేంద్రంలో ఉన్న ఆదివాసీ భవనంలోని టైల్స్‌ను పగులగొట్టి కరెంటు వైర్లను, బోరు, బోర్ స్టాటర్‌ను దొంగిలించుకుని పోయిన దుండగులను అధికారులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథరావు, తుడుందెబ్బ నాయకులు విజయ్‌కుమార్, రాజేశ్వర్, సోము, ధర్ము, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు

కాగజ్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ భట్టుపల్లి ప్రధాన రోడ్డు మూలమలుపు వద్ద తాత్కాలిక మరమ్మతులు ఆదివారం పూర్తి చేశారు. ప్రధాన రోడ్డు మూలమలుపు వద్ద నీరు నిలిచి బురదమయంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించాలని రెండు రోజుల క్రితం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ఆదివారం ఎంపీడీవో రోడ్డుపై నీరు నిల్వకుండా ఉండేందుకు తాత్కాలికంగా పనులు చేయించారు.



బాల కార్మికులకు విముక్తి

- నెలాఖరు వరకు 'ఆపరేషన్ ముస్కాన్'
- ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- ఏటా రెండు సార్లు అధికారుల స్పెషల్ డ్రైవ్

ఆసిఫాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వి ద్య బాల్యానికి పునాది. అది బలంగా ఉంటేనే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చు. కొందరు తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బలపం పట్టాల్సిన చిన్నారులతో పనులు చేయిస్తున్నారు. పనుల నుంచి బాలలలకు విముక్తి కల్పించేలా ఏటా ప్రభుత్వం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రత్యేక తనిఖీలు చేపడుతోంది. జిల్లాలో మంగళవారం నుంచి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు.

● పలు శాఖల అధికారులతో బృందం

మహిళ శిశు సంక్షేమ శాఖ (బాలల పరిరక్షణ విభాగం), పోలీసు, కార్మిక శాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉద్యోగులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బడి మానేసి పనులు చేస్తున్న చిన్నారులను గుర్తిస్తారు. బస్టాండు,రైల్వే స్టేషన్లు, హోటళ్లు, దుకాణాలు, ఆటోమొబైళ్లు, ఇటుక బట్టీలు, మెకానిక్ షెడ్లు, వ్యవసాయ క్షేత్రాల్లో, ప్రమాదకరమైన పని ప్రదేశాల్లో పనులు చేస్తున్న బాలలను తనిఖీలు నిర్వహించి గుర్తిస్తారు. వారిని రక్షించడం తోపాటు పనిలో పెట్టుకున్న యాజ మాన్యంపై చర్యలు తీసుకుంటారు. బాలల తల్లిదండ్రు లకు కౌన్సెలింగ్ ఇస్తారు. వారు బడిబాట పట్టేలా చర్యలు తీసుకుంటారు. తల్లిదండ్రులు లేని పిల్లలు తారసపడితే ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పి స్తారు.

● జిల్లాలో 2017 నుంచి..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 2017 నుంచి ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో మొట్ట మొదటి సారిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ పేరుతో , జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్ర మాలను చేపడుతున్నారు. కాగా 2016 అక్టోబర్ 11న కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడింది. దీంతో 20 17 జనవరి నుంచి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపడు తున్నారు. ఈ ఏడాది జూలై 1 నుంచి 31 వరకు 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. 2017 నుంచి ఇప్పటివరకు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లో జిల్లాలో 1,114 బాలబా లికలను అధికారులు గుర్తించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక నిరోధక చట్టం కింద యజమానులకు రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సంవత్సరం	ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించిన బాలలు	ఆపరేషన్ ముస్కాన్‌లో గుర్తించిన బాలలు
2017	67	25
2018	47	31
2019	66	63
2020	106	---
2021	157	140
2022	101	52
2023	43	30
2024	68	61
2025	57	----

బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దు..
- మహేష్, జిల్లా బాలల సంరక్షణాధికారి



ఎట్టి పరిస్థితుల్లోను బాల కార్మికులను పనిలో పెట్టుకోకూడదు. పనిలో పెట్టుకున్నట్లయితే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదవుతాయి. తల్లిదండ్రు లు సైతం బాల బాలికలను పాఠశాలలకు పంపించాలి. బాల్యాన్ని బందీ చేయడానికి ఎవరు ప్రయత్నించినా ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకుంటుంది. ఈ నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తం గా ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతాం.

సిమెంటు రేకులు వితరణ

పెంచికలపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండలం బొంబాయిగూడ గ్రామంలోని కొత్వల్‌వాడకు చెందిన మహిళలకు ఎస్సై కొమురయ్య సిమెంటు రేకులు అందజేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షానికి గోగు గోగు అంకుబాయి నివాసం ఉండే ఇల్లు పూర్తిగా కూలి పోయింది. నిరాశ్రయులుగా ఉన్న అంకుబాయికి బదిలీపై వెళ్తున్న ఎస్సై కొమురయ్య హామీ ఇచ్చిన ప్రకారం సిమెంటు రేకులను ఆదివారం పంపించారు. బదిలీ అయి వెళ్తున్నా సిమెంటు రేకులు ఇచ్చినందుకు ఎస్సైకి సదరు మహిళ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సంతోష్, ప్రధాన కార్యదర్శిగా సదాశివ్, సంయుక్త కార్యదర్శిగా శివ, కోశాధికారిగా భీంరావు, ప్రచార కార్యదర్శిగా విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, గౌరవ సలహాదారులుగా రాజు, వెంకటేశ్వర్లు, సురేష్, రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు. రామ్మోహన్, హనుమయ్య, సురేష్, వేణుగోపాల్, శ్రీనివాస్, ముబషీర్, ఖలీల్, సంతోష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గొడవెల్లి, కంచుకోట, పోట్టి శ్రీరాములుచౌక్, బజర్‌వాడీ, హడ్కోకాలనీ, జన్కాపూర్‌లలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. మలిద ముద్దలతో, బెల్లం షర్బత్‌తో ప్రత్యేక వంటకా లతో డప్పుచప్పుల మధ్య పీరీలను ఊరేగిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకలను మండలంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఖమన, వాంకిడి, బంబార, ఇంధాని తదితర గ్రామాల్లో పీరీల బంగ్లాల వద్ద ప్రజలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం పండుగ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఉన్న ఉపవాసాలను విరమించారు. భాజా భజంత్రీలతో పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ సమీప చికిలి వాగులో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పీరీల బంగ్లా నుంచి పీరీలను భాజాభజంత్రీలతో డౌనల్ ఏరియా, బెస్తవాడ, ఎస్సీ కాలనీ, రైల్వే స్టేషన్, తదితర కాలనీల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమీప వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పీరీల బంగ్లా అధ్యక్షుడు హనుమంతు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. పీరీలను వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఎదురుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మండలం లోని పవర్‌గూడ పీరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పవర్‌గూడతో పాటు జామ్ని, జైనూర్, లేండిగూడ, కొలాంగూడ తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి లింగాపూర్ మండలం వంకమద్ది గ్రామానికి చెందిన పీర్లు అతిథిగా తీసుకొచ్చారు. మొహర్రం పండుగ త్యాగానికి ప్రతీకగా నిలిచిన పవిత్ర దినంగా భావిస్తారు. మండల కేంద్రంతోపాటు భూర్నూర్(కే), భూర్నూర్(బి), పాముపాడ,దేవుడుపల్లి, పంగడి తదితర గ్రామాల్లో పీర్ల పండగ ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.


ఆసిఫాబాద్‌లో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు


వాంకిడిలో పీరీలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


సిర్పూర్(టి)లో పీరీలను ఊరేగిస్తున్న నిర్వాహకులు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నారా యణ, ప్రశాంత్, అనీల్, పెంటు, మనోజ్, యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాజయ్య, అశోక్, వెంకటి, దుర్గయ్య, స్వామి, శ్రీకాంత్, శ్రీనివాస్త, ప్రభాకర్ పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, వెంకటేష్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు..వాహనదారుల తిప్పలు


రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

సిర్పూర్(టి), జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాగజ్‌నగర్- సిర్పూర్(టి)- కౌటాల ప్రధాన రహదారిపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఈ క్రమంలో ఆ రోడ్లపై వెళుతున్న వాహనదారులకు, ఎద్దులు, ఆవులు అడ్డుగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా..

దహెగాం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం చంద్రపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పీకలగుండం గ్రామంలో పలు కాలనీల ప్రజలు బురద రోడ్లతో అవస్థలు పడుతున్నారు. ఎస్సీ కాలనీ ప్రజలు, పాఠశా లకు వెళ్లే దారిపై నడవడానికి సైతం ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో బురద, నీరు నిలువ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు.


బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు

గుంతల రోడ్లతో అవస్థలు


సిర్పూర్(టి)లో గుంతలుపడిన రోడ్డు

సిర్పూర్(టి), జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని చీలపల్లి, ఇటిక్యాలపహాడ్, దుబ్బగూడ, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు మయంగా మారాయి. దీంతో ఇరువైపులా రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో నీరు ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

కాగజ్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు రాకుండా ఉండేందుకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పది రోజుల నుంచి ప్రధాన మురికి కాల్వల్లో పూడిక తొలగిస్తున్నారు. చెత్త తొలగింపు మిషన్ల సహాయంలో కాగజ్‌నగర్ ప్రధాన మురికి కాల్వలను శుభ్రం చేస్తున్నారు. కాగజ్‌నగర్ ప్రధాన మురికి కాల్వ ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మార్కెట్ వరకు ఉంటుంది. అలాగే మరో ప్రధాన కాల్వ ఫాతీమాకాన్వెంటు నుంచి సర్‌సిల్క్ కాలనీ వరకు ఉంటుంది. ఈ ప్రధాన కాల్వల్లో చెత్తాచెదారం లేకుండా పూర్తిగా తొలగిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే గతంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వీటిని గుర్తించి ఈ సారి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై కమిషనర్ రాజేందర్ ఆయా వాసులకు అవగాహన పరుస్తున్నారు. పారిశుధ్య పనులు వేగవంతం జరుపుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాపువాడలో కూడా నీరు నిలుస్తుండడంతో కమిషనర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. 30 వార్డుల్లోని ప్రధాన మురికి కాల్వల్లో పూడిక, చెత్తాచెదారం తొలగిస్తున్నారు.


పూడిక, చెత్తాచెదారం తొలగిస్తున్న సిబ్బంది

ఆధ్యాత్మిక తోవ.. సామాజిక సేవ



సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న దేవర వినోద్(ఫైల్)

● 2016లో చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు
● నంది పురస్కారం

అందుకున్న దేవర వినోద్

రెబ్బెన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆలయంలోనే అర్చకుడిగా పని చేస్తూనే వచ్చే భక్తులకు దైవ చింతనతో పాటు సేవా కార్యక్రమాలతో నిరంతర సేవకుడిగా పేరు తెచ్చు కుంటున్నారు. రెబ్బెన మండల ఇందిరానగర్‌లోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో దేవర వినోద్ అర్చకుడిగా పని చేస్తు న్నారు. ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతో 2016లో చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. స్వచ్ఛందంగా సేవలు అందిస్తూ అభినందనలు అందుకుంటున్నారు. నారాయణ, లక్ష్మి దంపతుల కుమారుడు వినోద్. సమాజసేవ చేయాలన్న సంకల్పంతో వచ్చిన ఆలోచనకు ఆచరణలో పెట్టేందుకు 2016లో దేవర వినోద్ పేరిట చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వేసవి కాలం వచ్చిందంటే ఈ ప్రాంత ప్రజలకోసం ఏటా అంబలి పంపిణీ చేస్తు న్నారు. నిత్యం 30నుంచి35 కిలోల జొన్నలతో సుమారు 500లీటర్ల అంబలి తయారు చేసి పంపిణీ చేయడం విశేషం. ప్రతీ ఆదివారం ఆలయం వద్ద ఉచిత అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఈ ప్రాంతంలో తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి సామూహిక వివాహాలు చేశారు. తలసేమియా బాధితురాలికి రూ20వేల ఆర్థిక సహాయం చేశారు. వినోద్ సేవలను గుర్తించిన శ్రీ జ్ఞాన సరస్వతి దేవి చారిటబుల్ ట్రస్టు ద్వారా కొవిడ్-19 ఉత్తమ సర్వీసు అవార్డును కూడా పొందారు. గత రెండేళ్ల క్రితం కూడా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవకుడిగా అవార్డును సొం తం చేసుకున్నారు. వినోద్ సేవలను గుర్తించి శిఖ ఆర్ట్స్ సంస్థ ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సామాజిక సేవా, ఆధ్యాత్మిక రంగం నుంచి నంది పురస్కారం కూడా అందజేసింది.

అవార్డులు రావడం ఆనందంగా ఉంది..
- దేవర వినోద్, ఆలయ పూజారి

సామాజిక సేవలను గుర్తించి అవార్డులు అందజేయడం ఆనందంగా ఉంది. ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతోనే ట్రస్టు ఏర్పాటు చేశాను. వేసవిలో ఏటా అంబలి పంపిణీ చేస్తున్నాను. ఆలయంలో ప్రతీ ఆదివారం అన్నదాన కార్యక్ర మం చేపడుతున్నాం. అందరి సహకారంతోనే ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

● ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్యాకేజీలు
● ఆదాయం పెంపునకు అధికారుల చర్యలు



ఆసిఫాబాద్ బస్టాండు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆదాయాన్ని రాబట్టి లాభాల బాట పట్టేలా అన్ని మార్గాలను ఆర్టీసీ యాజమాన్యం అన్వేషిస్తోంది. గతంలో ప్రయాణికుల సమస్యలను అంతగా పటించుకొని ఆర్టీసీ నేడు ప్రయాణికులకు చేరువయ్యేందుకు వినూత్నసేవలను ప్రవేశపెట్టడానికి ప్రణాళికరూపొందించుకుంది. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ డిపో కేంద్రం నుంచి వినోద, విహారయాత్రలకు ప్రత్యేక బస్సులను నడిపించే చర్యల్లో నిమగ్నమైంది. ఆదాయానికే పరిమితం కాకుండా ప్రయాణికుల కుటుంబాల సైతం వినోదం, విహారయాత్రలను పంపిం చేందుకు ప్రత్యేకంగా బస్సులను కేటాయించింది. ఇది వరకే ప్రయాణికులను ఆదరించేలా ప్రతి శుక్రవారం డిపోలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. నిత్యం విధులతో తీరికలేకుండా గడిపేవారికి కాలక్షేపంకోసం, తీర్థయాత్రలపై ఆసక్తి ఉన్నవారికోసం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో నుంచి 'విహారవినోదయాత్ర' పేరుతో బస్సు నడిపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రయాణికులు ఎక్కడికివెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారన్నది తెలుసుకొని ఈయాత్ర ప్రారం భానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసిఫా బాద్ డిపోలో మొత్తం82 బస్సులు ఉన్నాయి. ప్రతిరోజు 78బస్సులు ఆయారూట్లలో 33వేలకిలో మీటర్లు తిరు గుతున్నాయి. ప్రతిరోజు 45వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. డిపోకు ప్రతిరోజు రూ.20లక్షల ఆదాయం సమకూరుతోంది.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి
● **రాజశేఖర్, డిపో మేనేజర్, ఆసిఫాబాద్**



విహార వినోద యాత్రను ప్రయాణికులు సద్వినియో గం చేసుకోవాలి. ప్రస్తుతం మూడురూట్లలో బస్సులు నడపడానికి ప్రణాళికలు రూపొందించాం. గంగాపూర్, జోడేఘాట్‌కు పల్లెవెలుగు, వేములవాడ, కొండగట్టు, ధర్మపురిలకు ఎక్స్‌ప్రెస్, యాదాద్రి, స్వర్ణగిరి, రమానుజం విగ్రహం సందర్శన, చిలుకూరి బాలాజీలకు సూప ర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశాం. గంగాపూర్, వేములవాడ ప్రాంతాలకు ఒకరోజు ప్రయాణం ఉంటుంది. యాదాద్రి మాత్రం రెండురోజుల ప్రయాణం ఉంటుంది.

● యాత్ర సాగేదిలా..

ప్రయాణికుల సౌకర్యార్థం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో నుంచి విహారవినోదయాత్రకు ప్రత్యేక బస్సులు వేయనున్నారు. డిపో నుంచి ఉదయం 8 గంటలకు బస్సు బయలు దేరుతుంది. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయం చేరుతుంది. స్వామివారిదర్శనం అనంతరం బయలు దేరి స్వర్ణగిరికి చేరుతుంది. అక్కడ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోవచ్చు. తర్వా త రమానుజం విగ్రహం సందర్శనకు తీసుకువెళ్తారు. రాత్రి బస చేయిస్తారు. ఉదయం చిలుకూరి బాలాజీ ఆలయం చేరుకుంటుంది. దర్శనం అనంతరం తిరుగు పయనమై సాయంత్రం4 గంటలకు ఆసిఫాబాద్‌కు చేరుకుంటుంది. ప్రతి చోట గంట, రెండుగంటల సమయాన్ని కేటాయిస్తూ ఆలయాల్లో దర్శనం అనంతరం బయలు దేరేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రయాణికులతోనే బస్సు ఉండడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. మొత్తం 800కిలోమీటర్ల ప్రయాణం ఉంటుంది. పెద్దలకు రూ.2,110, పిల్లలకు రూ.1,060టికెట్ ధరలు నిర్ణయించారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి వెళ్లేందుకు పెద్దలకురూ.240, పిల్లలకు రూ.370, గంగాపూర్, జోడేఘాట్‌లకు పెద్దలకు రూ. 280, పిల్లలకు రూ.140గా నిర్ణయించారు.

అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య



రూప(ఫైల్)

దండేపల్లి జూలై 6 (ఆంధ్రజ్యోతి): అత్తారింటి వేధింపులు భరించ లేక ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. దండేపల్లి ఎస్సై తాహసీనోద్దీన్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్సెట్టిపేట మండల సూరారం చెందిన పోరండ్ల శంకరయ్య రెండో కూతురు పోరండ్ల రూప(22)ను గుడిరేవు గ్రామానికి చెందిన అల్లె మహేష్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరికి బాబు ఉన్నాడు. పెళ్లియిన కొద్ది రోజులు బాగానే కాపురం చేసారు. అనంతరం దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు జరిగాయి. పెద్ద మనుషుల సమక్ష్యంలో పంచాయితీ నిర్వహించి వారికి నచ్చజెప్పారు. 10నెలల క్రితం జీవనోపాధి కోసం అల్లె మహేష్ సింగపూర్ వెళ్లాడు. అయినా తరుచుగా రూపను ఫోన్‌లో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ వేధించేవాడు. ఆయనతో పాటు మహేష్ తల్లిదండ్రులు పుల్లయ్య, లక్ష్మి, వారి భావ చెల్లి సుమన్, మమతలు కూడా వివాహేతర సంబంధాలు అంటగట్టి వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలో తీవ్రమనస్థాపం చెందిన రూప ఈనెల 5వ తేదీ శనివారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు ఆమెను లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ ఆదివారం మృతి చెందింది. తన కూతురు మృతికి అత్తింటి వారి వేధింపులే కారణమని రూప తండ్రి ఆరోపిస్తున్నాడు. మృతురాలు తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాహసీనోద్దీన్ వెల్లడించారు.

మరింత చేరువలో.. మీ సేవ

» వివాహ, భూముల విలువ ధ్రువపత్రాలు పొందే అవకాశం



వాంకిడి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పలు రకాల ప్రయోజనాలను అందిస్తున్న 'మీ సేవ' ప్రజలకు మరింత చేరువవుతోంది. ప్రజలకు పలు రకాల సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రస్తుతం మీ సేవ కేంద్రాలు రెవెన్యూ, పట్టణ, పంచాయతీరాజ్ తదితర శాఖల సేవలు అందిస్తూ పలు ధ్రువీకరణ పత్రాల జారీతో ఎన్నో రకాల ప్రయోజనాలను అందిస్తున్నాయి. తాజాగా రిజిస్ట్రేషన్ శాఖ జారీ చేసే వివాహ ధ్రువీకరణ, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలను మీ సేవ ద్వారా పొందే వెసులు బాటు కల్పించింది. వివాహ ధ్రువపత్రం కోసం నూతన దంపతులు గతంలో ఇబ్బందులు పడేవారు. గత మంగళవారం రోజున రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వీటిని ప్రారంభించిఈ సేవలు తక్షణం అమల్లోకి వచ్చాయని తెలిపారు. అధికారులు మీసేవ కేంద్రాల నిర్వహకులకు, ఆపరేటర్లకు నూతన సర్వీసులకు సంబంధించి అవగాహన, శిక్షణ కల్పించడం ద్వారా వినియోగ దారులకు నాణ్యమైన సేవలు అందేఅవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ ప్రయాస లేకుండా వివాహన ధ్రువీకరణ పత్రం అవసరం ఉన్న వారు మీ సేవ కేంద్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. దీని కోసం వధూవరుల ఆధార్, ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు ఐడీ కార్డు తదితర గుర్తింపు అవసరమవుతాయి. వయసు రుజువు కోసం పదో తరగతి మెమో, రెండు కుటుంబాలకు చెందిన వివాహ ఆహ్వాన పత్రికలు, పెళ్లికి సంబంధించిన రెండు ఫొటోలు, ముగ్గురు సాక్షులకు చెందిన గుర్తింపు పత్రాలు జిరాక్స్ ప్రతులు అందజేయాలి. గృహ నిర్మాణాలు, ఇతర బ్యాంకు రుణాల కోసం వ్యవసాయేతర భూములకు మార్కెట్ విలువ ధ్రువ పత్రాలు తప్పనిసరి అవసరం. గతంలో వీటిన రిజిస్ట్రేషన్ శాఖలో మాన్యువల్‌గా అందించేవారు.

జాప్యం లేకుండా అందించాలని..

అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు జాప్యం లేకుండా నిర్దిష్టమైన పద్ధతిలో అందిచాలన్న ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం సులభంగా, వేగంగా నినాదంతో 2011లో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దశల వారీగా నూతన సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. రెవెన్యూ, రవాణా, పోలీస్, జీహెచ్ఎంసీ, మున్సిపల్, విద్యుత్తు, ఎండోమెంట్, వ్యవసాయ, రిజిస్ట్రేషన్, పౌర సరఫరా, విద్యాశాఖకు చెందిన ప్రస్తుతం సుమారు 300 రకాల పౌర సేవలు అందిస్తుం డగా గత మార్చి నుంచి మరో 9 రకాల సేవలను మీసేవ జాబితాలో చేర్చింది. రెవెన్యూ పరిధిలోని సేవలతో పాటు ఆటవీశాఖకు సంబంధించిన నూతన ఐచ్ఛికాలను అందు బాటులోకి తెచ్చింది. రెండు విద్యా కోర్సుల మధ్య గ్యాప్ పీరియడ్‌ను ధ్రువీకరించడానికి గ్యాప్ సర్టిఫికెట్, పౌరుల సేరు మార్పిడి, పౌరులస్థానికతను నిర్ధరించేలా లోకల్ క్యాండిడేట్ (స్థానిక అభ్యర్థి) సర్టిఫికెట్, మైనార్టీలకు మైనార్టీ పథకాలు, ఉపకారవేతనాలు, రిజర్వేషన్ వంటి అంశాలను ధ్రువీకరిం చేలా మైనార్టీ సర్టిఫికెట్, కులం, ఆదాయం ధ్రువపత్రాల పునఃజారీ(రీఇష్యూ) వెనుకబడిన తరగతులకు చెందిన వారికి క్రిమీలేయర్-నాన్ క్రిమీలేయర్ ధ్రవపత్రం, వయో వృద్ధుల నిర్వహణ కేసులు, పర్యవే క్షణ వ్యవస్థ వంటి సేవలు రెవెన్యూ శాఖ పరిధిలో ఉనా యి. వన్యప్రాణుల దాడిలో మరణించిన వ్యక్తులు, జంతువులకు సంబంధించి అందించే నష్టపరిహారం, కలప (టింబర్) డిపోలు, సామిల్ అనుమతులు, రెన్యూవల్, నిర్వహణ వంటి ఆటవీశాఖ సేవలు మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాండూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి బోర్డు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అయి లి మల్లేష్ (36) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మల్లేష్ రాత్రి సమయంలో తన బైక్‌పై బోయపల్లి బోర్డు వైపు వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి స్వస్థలం ఓదెల కాగా ఉపాధి కోసం కాసిపేటలో నివాసం ఉంటున్నాడు. కుటుం బీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో స్నానానికి వెళ్లి మహిళ..

మంచిర్యాలక్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గోదావరికి స్నానానికి వెళ్లి మద్దెల లక్ష్మి(50) మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోటపల్లికి చెందిన లక్ష్మీ సోముగూడెంలో నివాసం ఉంటున్నారు. భర్త రాజలింగు సింగరేణి కార్మికుడు. గోదావరిస్నానం కోసం గోదావరిలో దిగగా ప్రమాదవ శాత్తు మృతి చెందింది. భర్త రాజలింగు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

కార్మికుల హక్కులు కొల్లగొట్టడం సరికాదు

శ్రీరాంపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా కొట్లాడి సాధించుకున్న కార్మికుల హక్కులు కొల్లగొట్టడం సరికాదని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయ ఆవరణలో ఆదివారం సమ్మె పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇబ్బందులు కలిగేలా తీసుకొచ్చే చట్టలను నిరసిస్తూ ఈ నెల 9న సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో నాయకులు అప్పారావు, శంకర్, సుధాకర్, రాంబాబు, సురేష్, రాము, సమ్మయ్య, రాజేష్, విజయేందర్, శశి, మల్లేశ్వరి, శ్వేత, శిరీష, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటం



మాట్లాడుతున్న బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

శ్రీరాంపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల రక్షణకు నిరంతర పోరాటం చేస్తామని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నస్పూర్‌కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని కార్మిక సంఘాల తమ రాజకీయ అవసరాల కోసం ఈ నెల 9న సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తమ యూనియన్ ఈ సమ్మెలో పాల్గొనడం లేదని పేర్కొన్నారు. దేశంలో అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా తయారు చేసిందన్నారు. వాటిలో వేతనాల కోడ్-2019, సామాజిక భద్రత కోడ్-2020లను తమ యూనియన్ స్వాగిస్తోందన్నారు. వీటి ద్వారా అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులక కనీస వేతన హక్కు, గెగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. మరో రెండు కోడ్లు అయిన పారిశ్రామిక సంబంధాల కోడ్-2020, ఉద్యోగ భద్రత, ఆరోగ్యం, పని నిబంధనల కోడ్-2020లో కొన్ని సవరణలు అవసరమన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతుండగానే సమ్మెకు పిలుపునివ్వడం సరికాదన్నారు. మరింత లోతుగా చర్చించి వీలైనన్ని సవరణలు చేపట్టాలని కోరారు. సింగరేణి కార్మికులు సైతం బాధ్యతాయుతంగా వ్యవహరించి సమ్మెలో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐలవేణి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు భూంపల్లి రమేష్, కట్కూరి సతీష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శాంతం సంపత్, గోళ్ల మహేందర్, నాయకులు కిరణ్ కుమార్, రామకృష్ణ, రాజు, బాపు, తదితరులు పాల్గొన్నారు.



సమ్మెను విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం సార్వత్రిక సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చాంద్ పాషా, మణిరాంసింగ్, రాజన్న, మహేందర్, శంకర్, మల్లన్న పాల్గొన్నారు

మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి తోకల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌కు వినతిపత్రం అందించారు. మెడికల్ బోర్డుకు ద్వారా రిఫరల్‌కు వెళ్లిన కార్మికులకు ఆర్థికంగా నష్టం జరుగుతోందన్నారు. అటు డ్యూటీ లేక వేతనాలు రావడం లేదని, ఇటు మెడికల్ బోర్డు పూర్తికావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

శ్రీరాంపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. రాయమల్లు, రాష్ట్ర కార్యదర్శి మేకల పోచమల్లు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలను బడా పారిశ్రామిక వర్గాలకు కట్టబెట్టేందుకు 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని ఆరోపించారు. పని గంటలను సైతం పెంచే యోచనలో ఉన్నారన్నారు. ఈ విషయంలో కార్మిక రంగానికి తీరని నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. సింగరేణి బొగ్గు గనుల్లో సైతం ఆయా కోడ్లను అమలు చేస్తే కార్మికులు హక్కులు కోల్పోతారని, కనీస వేతనాలు అందించే అవకాశం ఉండదన్నారు. వీటిని నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీ యూ నాయకులు రత్నకుమార్, రాములు, రాజకుమార్, సదానందం, రామస్వామి, యాకయ్య, దుర్గయ్య, రాకేష్, శంకర్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కోసం ఏకమైన కార్మిక సంఘాలు

మందమర్రిటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక , కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలన్నీ ఏకమయ్యాయి. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం, టీబీజీకేఎస్ , ఇతర సంఘాలు కూడా సమ్మె విజయవంతానికి స్నేహ హస్తం అందించాయి. గత కొన్ని రోజులుగా ఒక సంఘంపై మరొక సంఘం దుమ్మెత్తి పోయడంతో పాటు వాడి వేడిగా విమర్శలు చేసుకున్నాయి. కానీ కార్మిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మె విజయవంతం కోసం కార్మిక జేఏసీగా ఏర్పడి సింగరేణి వ్యాప్తంగా గనుల వద్ద గేట్‌మీటింగ్‌లు, కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సింగరేణిలో సమ్మెలు నిషేధించారు. కార్మికులు ఈ సమ్మెకు మొగ్గు చూపుతుండడంతో యాజమాన్యం నివారణ చర్యలు చేపట్టింది. జీఎంలు ప్రత్యేక సమావేశాలు పెట్టి సమ్మెకు సింగరేణికి ఎలాంటి సంబంధం లేదని ప్రచారం చేస్తున్నారు. ఆయా పరిశ్రమలతో చేసుకున్న బొగ్గు ఒప్పందాల ప్రకారం బొగ్గును సరఫరా చేయకపోతే సంస్థపై నష్టం పడుతుందని చెబుతున్నది. కార్మికులు విధులకు వస్తే వారికి రక్షణ కల్పించేందుకు పోలీసులను గనుల వద్ద మోహరించనున్నట్లు చెబుతున్నారు.

జీవో ఉపసంహరించుకోవాలి

రెబ్బెన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ పర్యవేక్షణలో ఉండే సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు/కార్మికుల పని గంటల విషయంలో నిబంధనలను సవరిస్తూ జారీ చేసిన జీవో 282ను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికులకు ప్రయోజనం చేకూరే జీవోలను ఇంత వరకు అమలు జరుగడం లేదన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కార్మికులను అణగదొక్కే విధంగా నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని అమలు చేసేందుకు యత్నిస్తోందన్నారు. వీటిని ఐక్య పోరాటాల ద్వారా అడ్డుకుంటామని తెలిపారు. సమావేశంలో నాయకులు శంకర్, రవి, గురు ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5న జారీ చేసిన పని గంటల పెంపు ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌జీకేఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వాణిజ్య పరిశ్రమల్లో 10, 12 గంటల పని సమయాలను అమలు చేయాలని చూడడం సరికాదన్నారు. నాలుగు లేబర్ కోడ్ల అమలులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ ఉత్తర్వులు వచ్చినట్లు తాము భావిస్తున్నామన్నారు. ఈ నిర్ణయాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని,



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

లేనిపక్షంలో తాము ఉద్యమిస్తామని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో టీఎల్‌జీబీకెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చాంద్‌పాషా, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మణిరాంసింగ్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, ఎస్‌జీకేఎస్ రాష్ట్ర కన్వీనర్ మహేందర్, టీయూసీఐ జిల్లా కన్వీనర్ గోగర్ల శంకర్, నాయకులు మేకల రాజన్న, బిల్లు మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

క్యాప్ స్కాలర్‌షిప్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పుణేలో గల భారత క్రికెటర్ ఇర్ఫాన్‌పఠాన్ క్రికెట్ అకాడమిలో క్యాప్ స్కాలర్‌షిప్ పోటీలకు బెల్లంపల్లి పట్టణానికి చెందిన రిత్విక్ ఎంపికయ్యాడు. రిత్విక్ పుణేలో జరిగిన అండర్ 14 ట్రయల్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు గాను క్యాప్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. రిత్విక్ పట్టణంలోని శ్రీచైతన్యలో 6వ తరగతి చదువుతున్నాడు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

బెల్లంపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి నిస్తుందని తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం రాజన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కూలీలకు ఆటో డ్రైవర్లకు 400 మందికిపైగా అల్పాహారం పంపిణీ చేశారు. పదవి విరమణ తరువాత వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రంగ రామన్న, గెల్లి జయరాంయాదవ్, శ్రీనివాస్, వెంకటరాజం, ఓదెలు, లింగయ్యలు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జైపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన కాటం నర్సమ్మ అనే మహిళకు కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి రూ. 3 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు మహిళకు అందజేశారు. నర్సమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా గ్రామ కాంగ్రెస్ నాయకులు చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన రూ. 3 లక్షల ఎల్‌వోసీ (లైన్ ఆఫ్ క్రెడిట్)ను మంజూరు చేశారు. ఈ సందర్భంగా మహిళ కుటుంబీకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, మధుకర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కాసిపేట,జూలై 6(ఆంధ్ర జ్యోతి): మండలంలోని లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి ఆదివారం మండల కేంద్రంలో చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందన్నారు. అనారోగ్యం భారినపడి ఆర్థికంగా నష్టపోయినవారికి ప్రభుత్వం నుంచి ఆర్థికంగా సాయం అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రదీప్, స్థానిక నాయకులు రాజమౌళి, ముత్యాల రాజమౌళి, జనార్ధన్ రెడ్డి, ముత్యాల నగేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

పోస్టులకు దరఖాస్తులు

తాండూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పలు పోస్టులకు దరఖాస్తులు వచ్చాయి. అసిస్టెంట్ కుక్ పోస్టుకు 14 దరఖాస్తులు, డే వాచ్ ఉమెన్‌కు 46, స్వీపర్, స్కావెంజర్ పోస్టుకు 3 దరఖాస్తులు వచ్చాయని ఎంఈవో మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు.

వరిలో విత్తనమే కీలకం

- విత్తనశుద్ధితో రోగాలు దూరం
- ముందు జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన
- నారుమడుల తయారీలో రైతులు బిజీ


నారుమడి సిద్ధం చేసుకుంటున్న రైతు



నెన్నెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విత్తు కొద్ది పంట అంటారు. పంటల సాగుకు కీలకమైన విత్తనం విషయంలో నిర్లక్ష్యం ఖరీదు రైతుకు ఒక పంట కాలంతో సమానం. జిల్లాలో ప్రధాన పంటల్లో ఒకటైన వరి సాగు కోసం విత్తన సేకరణలో జాగ్రత్తలు తీసుకోకపోతే దాని ప్రభావం దిగుబడిపై పడుతుంది. నాసిరకం విత్తనాలు కొని నాటితే పంట పెరుగుతుందే తప్ప దిగుబడి రాదు. అందుకే విత్తనం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నేలకు తగ్గ విత్తనాలు ఎంపిక చేసుకుని, విత్తనశుద్ధి చేసి నారుమడులు తయారు చేసుకుంటే లాభాలు పండుతాయి.

విత్తనశుద్ధి..


మండె సిద్ధం చేసుకుంటున్న రైతు

సమగ్ర సశ్యరక్షణలో విత్తనశుద్ధి కీలకమైనది. శిలీంద్ర జాతులు నేల ద్వారానే విత్తనాలకు చేరతాయి. పంటకు తెగుళ్ల పురుగులు ఆశించకుండా నాణ్యమైన పంట కోసం విత్తన శుద్ధి తప్పనిసరి. తెగులు సోకిన త రువాత మందులు వాడటం కంటే ముందే విత్తన శుద్ధి చేసుకోవడం మంచిది. దీని వల్ల కూలీల ఖర్చులు, వాతావరణ కాలుశ్యం, శ్రమ తగ్గుతాయి. కీటక, శిలీంద్ర, బ్యాక్టీరియా సంబంధిత మందులతో విత్తన శుద్ధి చేసుకుంటే మంచి ఫలితాలుంటాయి. 8-10 తేమ శాతం ఉన్నప్పుడు విత్తనశుద్ధి చేసుకోవాలి. వరిలో కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజం మందు కలిపి 24 గంటల తరువాత నారు పోసుకోవాలి. మండె కట్టే వారు విత్తనాలను 24 గంటలు ద్రావణంలో నానబెట్టి వాడుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి ఒక లీటరు మందునీరు సరిపోతుంది.

వరిసాగులో తొలి నాళ్ల నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి

సురేఖ, ఏడీఏ భీమిని



వరిలో విత్తన ఎంపిక, శుద్ధి చేసుకోవడం, నారు పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకొంటే ఆశించిన దిగుబడులు వస్తాయి. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక రకాలను బట్టి నారు ముదరకముందే నాట్లు వేసుకోవాలి. తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవడం కోసం తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. దీంతో పంట ఆరోగ్యంగా పెరిగి పురుగు మందుల ఖర్చు తగ్గుతుంది. పంట రోగాల బారిన పడితే డీలర్లు ఇచ్చే మందులు కాకుండా వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే, క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన పరిష్కారం చూపుతారు.

వరి నారు పెంపకం

ఆరోగ్యమైన వరి నారు కోసం ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా మడిని సిద్ధం చేసుకొని 10-12 రోజుల వ్యవధిలో పలు సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి అనుకూలంగా ఉండేందుకు ముందుగానే కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి కిలో నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌లను దుక్కిలో కాని దమ్ములో కాని వేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని ఒక గుంటకు 12 కిలోలు పడే విధంగా చల్లుకోవాలి. నారు తొలి ఆకు పూర్తిగా విచ్చుకొనే వరకు ఆరు తడులు ఇవ్వాలి. ఆ తరువాత పలుచగా నీరు కట్టాలి.

నారు మొక్కలపై జింకు లోపం గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ కలిపిన ద్రావ ణాన్ని పిచికారి చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బో ఫ్యూరాన్ 3జీ గులికలను గుంట నారు మడికి 400 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా క్లోరిపైరీపాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి నారుపై పిచికారి చేయాలి. 12-14 రోజులకు ఒక గుంటకు కిలో చొప్పు న నత్రజని ఎరువు చల్లుకోవాలి.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాశ్

హాజీపూర్, జూలై6 (ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో అన్ని రకాల హమాలీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాశ్ తెలిపారు. ఆదివారం మండలంలోని ముత్యంపేట, మిట్టపల్లి, దొనబండ, గ్రామాల్లోని రైతు మిల్లుల్లో హమాలీలతో కలిసి సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ కేంద్రంలో 3వసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్‌కోడ్లను రద్దు చేయాలని హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు, ప్రమాద బీమా, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఈ నెల 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైస్‌మిల్స్ యూనియన్ కార్యదర్శి చిన్నయ్య, నాయకులు రవి, కొమురయ్య, గంగన్న, చందు, జయరాజులు పాల్గొన్నారు.

దండేపల్లి: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిందని, కార్మిక వ్యతిరేఖ చట్టాలను తిప్పికొడదామని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏ లాల్‌కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం దండేపల్లి మండలం ముత్యంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక హక్కుల కొల్లగొట్టడం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక ప్రజా రైతు వ్యతిరేఖ విధానాలను వ్యతిరేసిస్తూ జూలై 9న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మెకు మద్దతు ఇచ్చి సంపూర్ణ సంఘీబావం తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కిష్టయ్య, లచ్చన్న, శంకర్, మీరజ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

తాండూర్ : ఈ నెల 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పేర్కొన్నారు. ఆదివారం తాండూర్‌లోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. దీన్ని తిప్పి కొట్టేందుకు కార్మికులందరు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయ్య మొగిలి, సాలిగామ సంతోష్, కొండు బానేష్, మల్లయ్య, ప్రహ్లాద్, సత్యనారాయణ, నాగరాజు, శంకర్, లక్ష్మీ, సాయికుమార్, శ్రీనివాస్, దుర్గయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

ఐలాండ్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మంచిర్యాలక్రైం, జూలై6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీటాకీస్ సమీపంలో గల ఐల్యాండ్‌కు ఢీకొని బీటెక్ విద్యార్థి సంజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గద్దెరాగడికి చెందిన గోడూరి సంజయ్ శనివారం అర్ధరాత్రి మంచిర్యాల నుంచి గద్దెరాగడికి వెళ్తుండగా సమీపంలోని ఐల్యాండ్‌కు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగ ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చెస్‌లో నైపుణ్యం పెంపొందించుకోవాలి

లక్షెట్టిపేట జూలై 6 (ఆంధ్రజ్యోతి): చెస్ ఆటలో విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎక్సలెంట్ చెస్ అకాడమీ నిర్వాహకులు మహేష్ హలావత్ అన్నారు. మంచిర్యాల కేంద్రంలో ఎక్సలెంట్ చెస్ ఎకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలో లక్షెట్టిపేట ఎంజేపి గురుకుల చెందిన 6వ తరగతి విద్యార్థి వేముల అర్జున్ అండర్ 13 కేటగిరి విభాగంలో ప్రతిభ కనబరిచి మొదటిస్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు వెల్లడించారు. చదరంగం పోటీలో భారతదేశం ఆటగాళ్లు ప్రపంచంలోనే మెరుగైన ప్రదర్శన ఇస్తున్నరన్నారు. అర్జున్ కూడా చెస్ పోటీలో మెరుగైన ప్రదర్శన ఇచ్చాడన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని అభినందించి ఆత్యుత్తమ స్థాయిలో ఉండాలని కోరారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న రత్నం తిరుపతి

నెన్నెల, జులై 6 (ఆంధ్రజ్యోతి) : పోడు భూముల సమస్య పరిష్కారానికి ఈ నెల 14న చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి పిలుపునిచ్చారు. నెన్నెలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కంటే ముందు ఇంద్రవెల్లి సభలో పోడు సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. టైగర్ జోన్ పేరిట ఆదివాసీలను అడవుల నుంచి తరిమేస్తున్నారని ఆరోపించారు. జీవో నెం. 49ను రద్దు చేసి పోడుభూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, మిగులు భూములను నిరుపేదలకు పంచిపెట్టాలని డిమాండ్ చేశారు. పోరాడితేనే పోడు భూములకు పట్టాలు దక్కుతాయన్నారు. పోడు పట్టాల కోసం కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాలో నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. లచ్చన్న, బాపు, శంకర్, భీమేష్ ఉన్నారు.

ఏకలవ్యుడి విగ్రహాలు ఏర్పాటు చేయాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గురుశిష్యుల బంధాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి ఏకలవ్యుడని, ఆయన విగ్రహాలను ప్రభుత్వం ద్వారా ఊరూరా ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా అధ్యక్షుడు ఉంద్రాళ్ల ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఏకలవ్యుడి జయంతిని పురస్కరించుకొని విలేజ్ శ్రీరాంపూర్‌లోని చిత్రపటానికి పూలమాలలు వేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ, తెలంగాణకు చెందిన ఎరుకల కులస్తులు తొలి ఏకాదశి రోజున ఏకలవ్య జయంతిని నిర్వహించుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా అధికారికంగా ఏకలవ్య జయంతి నిర్వహించాలని, స్థలం కేటాయించి ప్రభుత్వమే విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఉంద్రాళ్ల అశోక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉంద్రాళ్ల రవి, నాయకులు జగన్నాథుల మహేష్, దుగ్యాల రవి కుమార్, దుగ్యాల సుభాష్, జగన్నాథుల మల్లేష్, జగంధుల మహేష్, ఉండాడి శివ, దుగ్యాల సంతోష్ పాల్గొన్నారు.

నెన్నెల : తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో నెన్నెల మండలం గంగారంలో ఆదివారం ఏకలవ్య జయంతిని నిర్వహించారు. జెండా ఆవిష్కరించి, ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎరుకల కులస్థులు సామాజికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకిని రవి, జిల్లా గౌరవ అధ్యక్షులు దుగ్యాల పోశం, మండల అధ్యక్షులు దుగ్యాల మహేందర్, నాయకులు సంతోష్, సుదర్శన్, రాము పాల్గొన్నారు.

ఇంధన్‌పల్లి ఎఫ్‌ఆర్‌వోగా శ్రీధరాచారి

జన్నారం, జూలై6 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ భయారణ్యంలోని జన్నారం డివిజన్‌లో గల ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా శ్రీధరాచారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కారం శ్రీనివాస్ బదిలీ చేయగా శ్రీధరాచారి బాధ్యతలు స్వీకరించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయారణ్యంలో ఇంధన్‌పల్లి రేంజ్‌లో రేంజ్ పరిధిలోని వన్య ప్రాణులకు ఆటంకం కలిగించిన అడవిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరిచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రేంజ్ అధికారులు ఉన్నారు.

పోచమ్మ తల్లి ఆలయం రోడ్డు బురదమయం


బురదమయంగా పెద్ద పోచమ్మ ఆలయం రోడ్డు (ఫైల్)

దండేపల్లి జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మందొడ్డ నుంచి నేతకని కాలనీ మీదిగా చింతల చెరువు సమీపంలో పోచమ్మతల్లి ఆలయానికి వేళ్లే రోడ్డంత బురదమయంగా మారింది. ఇటీవల ఎకదాటిగా కురిసిన వర్షలకు ఈరోడ్డంత గుంతలు పడి వర్షపునీరు నిలిచి బురదగా మారి నడవడానికి కష్టంగా మారింది. ఆషాడ మాసం కావడంతో పోచమ్మ ఆలయానికి వేళ్లే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు గుంతల్లో మొరం పొయించాలని భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అనిల్ రావుల

మంచిర్యాలక్రైం, జూలై6 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గ్రామ స్థాయి నుంచి కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అనిల్‌రావుల అన్నారు. మంచిర్యాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరిగే నగేశ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సోషల్ మీడియా కమిటీలను ఏర్పాటు చేసి సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నస్పూర్ మండల అధ్యక్షులు భీమిని రాజేశ్, నాయకులు సుమన్, రాందేవి వెంకటేష్, అజార్‌లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

మంచిర్యాలక్రైం, జూలై6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం వద్ద జరిగిన ప్రమాదంలో బాసుదేవ్‌కుతీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం నూతనంగా నిర్మిస్తున్న భవనం 3వ అంతస్తుపైకి క్రేన్ బకెట్ ద్వారా ఇటికను పైకి తరలించే క్రమంలో తాడుతెగి పడడంతో అక్కడే పని చేస్తున్న వెస్ట్‌బెంగాల్‌కు చెందిన బాసుదేవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

లక్షెట్టిపేట జూలై 6 (ఆంధ్రజ్యోతి): వసతిగృహంలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు చాతరాజు దుర్గప్రసాద్ సూచించారు. ఆదివారం లక్షెట్టిపేటలో ప్రభుత్వ షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ బాల బాలికల కళాశాల, పాఠశాలవసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. వసతిగృహాలలో సరుకుల నాణ్యత, వసతి గృహ పరిసర ప్రాంతాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులు, సిబ్బంది సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. భోజనం వండే సిబ్బంది జాగ్రత్తగా ఉండి విద్యార్థులకు చక్కటి భోజనం అందించేల చూడాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు.

చిన్న తరహా నీటి పథకాలపై పట్టింపేది..

(5వ పేజీ తరువాయి)

నిర్మించడంతో పనులు పూర్తిగా మరు గున పడ్డాయి. మరోవైపు అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌లో సుందరశాల ఎత్తిపోతల పథకం ముంపునకు గురైంది. పంప్ హౌజ్‌లోని విద్యుత్తు మోటార్లు, ఇతర సామగ్రి నీటిలో మునిగి పనికిరాకుండా పోయాయి. దీంతో ఇటీవల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన సంబంధిత అధికారులు మరమ్మతులు చేయడం సాధ్యం కాదని తేల్చినట్లు సమాచారం. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలో నీరు నిలువ చేయాల్సిన పరిస్థితులు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఈ క్రమంలో సుందరశాలలోని ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రూ. 1658 కోట్ల వ్యయంతో చెన్నూర్ నియోజ కవర్గం పరిధిలో దాదాపు లక్ష ఎకరాలకు నీరు అందించే చెన్నూరు ఎత్తిపోతల పథకానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూప కల్పన చేయడంతో సుందరశాల చిన్న తరహా పథకానికి మరమ్మతులు చేపట్టడం వృధా అనే భావనకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పథకం కథ కంచికి చేరగా, వివిధ పనుల కోసం వెచ్చించి న కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అయ్యాయి. విద్యుత్ తీగలు, ఇతర విలువైన పరికరాలు దొంగల పాలయ్యాయి. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రూ. 1658 కోట్ల ఎత్తిపోతల పథకం కూడా నిర్వీర్యం అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మాటే ఎత్తడానికి సుముఖంగా లేదు. దీంతో ఆ ప్రాజెక్టు కథ సైతం కంచికే చేరినట్లయింది. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన రెండు పథకాలు అర్థాంతరంగా నిలిచిపోగా, సుందరశాలలోని పాత పథకం పనులైనా చేపట్టాలనే డిమాండ్లు ఉన్నాయి. ఈ విషయమై చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద దృష్టిసారించాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఆదివారం మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు పురుషోత్తం, రజనీష్ జైన్, కృష్ణమూర్తి, హరికృష్ణ, రవి, రాజన్న, రాకేష్ రెన్వా, అశోక్ పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఆదివారం శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, నాయకులు బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్, జాడి తిరుపతి, కొండపాక చారి, కాయిత రాజేశ్వర్, శ్రీనివాస్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ, దాని అనుబంధ సం ఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేశ్, సీనియర్ నాయకులు దీక్షితులు, రొడ్డ మోహన్ ఆయన చిత్రప టానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మొక్క లు నాటారు. రంగు శ్రీనివాస్, కర్రావుల వినయ్, పోతునూరి రాజేందర్, ఎర్రోజుల శ్రీనివాస్, హోం ప్రకాశ్, రాములు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: రామకృష్ణపూర్‌లో ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ సీనియర్ నాయకుడు అందుగుల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అక్కల రమేష్, రజనీష్ జైన్, ఈశ్వరచారి, శ్రీనివాస్, దేవేందర్, రాజేష్, రవి సాగర్, రవి పాల్గొన్నారు.

వేమనపల్లి : జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జ యంతి వేడుకలను ఆదివారం వేమనపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏట మధుకర్, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, చరణ్‌రాజ్, నాయకులు శ్రీకాంత్, అజయ్‌కుమార్, లస్మయ్య, అంజి, మధునయ్య, సతీష్, సమ్మయ్య పాల్గొన్నారు.


చెన్నూరులో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు


మంచిర్యాలలో శ్యామా ప్రసాద్ జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు


మందమర్రిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

చిన్న తరహా నీటి పథకాలపై పట్టింపేది..?

- స్టేజ్-2 దశలోనే నిలిచిన పనులు
- అర్ధాంతరంగా నిలిచిన సుందరశాల ఎత్తిపోతల పథకం
- మరమ్మతులు చేపడితే రైతులకు ఉపయోగకరం



పంప్‌హౌజ్ సమీపంలో వృధాగా పడి ఉన్న విద్యుత్తు మోటారు



చెన్నూరు మండలం ముత్తెరావుపల్లి సమీపంలో అలంకారప్రాయంగా ఉన్న నీటి ట్యాంకు

మంచిర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందని ప్రాంతాల్లో ఆయకట్టుకు నీరిచ్చి అక్కడి రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన చిన్నతరహా ఎత్తిపోతల పథకాలు నిరాధరణకు గురవుతున్నాయి. నాసిరకపు పనులు, మరమ్మతుల్లో నిర్లక్ష్యం కారణంగా ట్రయల్‌రన్‌కే పరిమితం కాగా రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన పనులు రైతులకు ఏమాత్రం ఉపయోగపడకుండా పోయాయి. వాగులు, వంకలు, నదుల్లో వృధాగా పోతున్న నీటిని పంట పొలాలకు మళ్లించే ఉద్దేశ్యంతో చెన్నూరు మండలం సుందరశాలలో నిర్మించిన చిన్న తరహా నీటి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభానికి నోచుకోక ముందే ఆగిపోవడం రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. అధికారుల పట్టింపులేనితనం...కాంట్రాక్టరు నిర్లక్ష్యం మూలంగా ఏళ్ల తరబడి పనులు కొనసాగగా, చివరకు నీళ్లందకుండానే మూలన పడింది.

రూ. 8.27 కోట్ల అంచనా వ్యయంతో....

చెన్నూరు మండలం సుందరశాల సమీపంలోని గోదావరి ఒడ్డున రూ. 8.27 కోట్ల అంచనా వ్యయంతో చిన్న తరహా నీటి ఎత్తిపోతల పథకానికి రూప కల్పన జరిగింది. మండలంలోని సుందరశాల, దుగ్నేపల్లి, వెంకంపేట గ్రామాల్లోని 2260 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 2008లో ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారు. రెండు విడుతల్లో చేపట్టవలసిన పనుల్లో తీవ్ర జాప్యం జరిగి దాదాపు ఐదు సంవత్సరాల అనంతరం 2013 వరకు కొనసాగాయి. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. దీంతో పనుల్లో నాణ్యత లోపించగా ఆరంభంలోనే ట్రాన్స్‌ఫార్మర్ యార్డు ప్రహరీ, ర్యాంప్, పిల్లర్లలో పగుళ్లు తేలాయి. దీంతో అప్పుడే వాటిని తొలగించిన అధికారులు తిరిగి నిర్మించలేదు. పైగా 2014 వరకు హఠాత్తుగా పనులను నిలిపివేశారు. ఆ తరువాత తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించినా...పూర్తికాలేదు. స్టేజ్-1 పనులు దాదాపుగా పూర్తి చేసినప్పటికీ స్టేజ్-2 పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పంప్ హౌజ్ నిర్మాణం పూర్తయినా అందులో నీటిని ఎత్తి పోసేందుకు విద్యుత్తు మోటార్ల బిగింపు పూర్తిస్థాయిలో జరగలేదు. పంప్ హౌజ్ నుంచి డిస్ట్రిబ్యూటరీ (స్టేజ్-2) ట్యాంకు వరకు ఏర్పాటు చేసిన నాలుగు లైన్ల పైపులైన్ పనుల్లో ఒకటి పూర్తికాగా గతంలోనే ట్రయల్ రన్ నిర్వహించారు.

నీరందకుండానే నిలిచిన పనులు..

పంప్ హౌజ్ వద్ద మిగతా మూడు లైన్ల పనులు చేపట్టాల్సి ఉండగా, అర్ధాంతరంగా నిలిపివేశారు. పంట పొలాలకు సాగునీరు అందించే పైప్‌లైన్ నిర్మాణ పనులు కూడా పూర్తికాలేదు. మరో కిలో మీటర్ వరకు పనులు చేపట్టవలసి ఉండగా పంట పొలాలకు సాగునీరు అందకుండానే పనులు నిలిచిపోయాయి. ఐదేళ్లగా పనులు తిరిగి ప్రారంభించకపోవడం, మధ్యకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలో భాగంగా అన్నారం బ్యారేజీ...

(తరువాయి 7లో)

ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతి

మంచిర్యాలక్రైం, జూలై6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహా సభ కార్యదర్శిగా దెబ్బడ తిరుపతిని ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ముదిరాజ్ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు బండారి ప్రకాశ్ మంచిర్యాలకు చెందిన దెబ్బటి తిరుపతిని రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరిగంటి కొమురయ్య పాల్గొన్నారు.

బీసీ మేధావుల ఫోరం ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన బీసీ మేధావుల ఫోరం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బీసీ మేధావుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. చీఫ్ కో ఆర్డినేటర్‌గా శ్రీరాముల కొండయ్య, కో ఆర్డినేటర్లుగా డాక్టర్ నీల కంటేశ్వర్‌గౌడ్, రంగు రాజేశం, కనుకుంట్ల మల్లయ్య, షబ్బీర్ పాషా, రాజయ్య, చంద్రయ్య, అశోక్ యాదవ్, మహేష్, ప్రవీణ్, నాగరాజు, జైనుద్దీన్, లింగమూర్తి, రవిలు నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఉమ్మడి జిల్లాలో బీసీ మేధావులఫోరం కార్యకలాపాలను విస్తృతం చేయాలన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీక మొహర్రం అని ముస్లీం మత పెద్దలు షాకీర్ అహ్మద్, హబీబ్‌లు అన్నారు. ఆదివారం మొహర్రం వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పదిరోజుల క్రితం ప్రారంభమైన వేడుకలు చివరిరోజు ఆదివారం డప్పుచప్పుళ్లతో పీరీల ఊరేగింపు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలు వీదుల గుండా పీరీలను ఊరేగించారు. రెడ్డికాలనీ చౌరస్తా వద్ద పీరీలను ఉంచగా ప్రజలు పీరీలను దర్శించుకున్నారు. కుల మతాలకు అతీతంగా ప్రజలు హాజరయ్యారు. సీఐ ప్రమోద్‌రావు, ఎస్‌ఐ లు ప్రవీణ్, నేతృత్వంలో పోలీసు బందో బస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలు సోహెల్ ఖాన్, సాహిల్, సులేమాన్, ఫారుక్, ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

● మంచిర్యాల పట్టణం రాళ్లపేట యూత్ ఆధ్వర్యంలో మొహర్రం సందర్భంగా తెలంగాణ చౌక్‌లో షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎండీ సోహెల్, నబియాస్, ప్రశాంత్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం

మంచిర్యాక్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాస్‌చంద్రబోస్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ పటియాల హ్యాండ్ బాల్ సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేసుకున్న క్రీడాకారిణి పులిశెట్టి శృతిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోనే శ్యాం సుందర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో కనపర్తి రమేశ్, అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, కోచ్ సువార్కర్, అరవింద్ పాల్గొన్నారు.

హైటెక్ సిటీ కమిటీ ఎన్నిక

మంచిర్యాలక్రైం, జూలై6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హైటెక్ సిటీ అసోసి యేషన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా విలినేని కిషన్‌రావు, ప్ర ధాన కార్యదర్శిగా తౌటం చంద్రమౌళి, క్యాషియర్‌గా రాజనర్సు ఉపాధ్యక్షులుగా లక్ష్మీ నారాయణను ఎన్నుకున్నారు.

కార్మిక చట్టాలను కాలరాసే హక్కు లేదు

మందమర్రిలో సీఐటీయు మోటార్ సైకిల్ ర్యాలీ

మందమర్రిటౌన్, జూలై6 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కాలరాసే హక్కు పాలకవర్గాలకు లేదని సీఐటీయూ నాయకులు అన్నారు. మందమర్రిలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జాతీయరహదారి మీదుగా కోల్ బెల్ట్ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అంబేద్కర్ విగ్రహానికి సీఐటీయూ యూనియన్‌తో పాటు సీపీఎం పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు సీపీఎం జిల్లా అధ్యక్షులు సంకె రవి మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విచ్చలవిడిగా వ్యవహరిస్తుందని అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను అణచివేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతూ పోతుందని మండిపడ్డారు. ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెకు మోడి నేతృత్వంలోని కార్పొరేట్ మతోన్మాదులు కార్మివర్గంపై చేస్తున్న దాడిని తిప్పికొట్టడంతో పాటు నయా ఉదారవిధానాలను ప్రతిఘటిస్తూ నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయడం కోసమని కార్మిక వర్గం గుర్తించుకోవాలన్నారు. మోదీ పాలనలో దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోయిందని దేశ పరిస్థితి దారుణంగా ఉందని ఆయన మండిపడ్డారు. నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గందం రవి, రమేశ్, తిరుపతి, పోచం, రాజేంద్రప్రసాద్, రవీందర్ పాల్గొన్నారు.



మందమర్రిలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న సీపీఎం,సీఐటీయూ నాయకులు

మందమర్రిరూరల్ : ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఆదివారం రామకృష్ణపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు వెంకటస్వామి, అల్లి రాజేందర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను లేకుండా చేస్తుందని, దీన్ని తిప్పికొట్టేందుకు కార్మికులందరు సమ్మెలో పాల్గొనాలన్నారు.

ఆలయ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

జన్నారం, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాలయ కమిటీ సమావేశాన్ని ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. శ్రీసీతారమ చంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా 2003నుంచి బాధ్యతలు కొనసాగించి నేటి నుంచి త ప్పుకోనున్నట్లు సమావేశంలో కమిటీ అ ధ్యక్షులు మిక్కిలినేని రాజశేఖర్ వెల్లడిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 2003లో ఆలయ అభివృద్ధి కోసం బాధ్యతలు స్వీకరించి అప్పటి నుంచి ఇప్పటి వరకు డబ్బులు, వస్తువుల రూపకంగా ఆలయ ట్రస్టుకు 58,46,538 వచ్చాయని తెలిపారు. నేటి నుంచి ట్రస్టు బాధ్యతలను తప్పుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్సింగరావు, జాజాల శ్రీనివాస్, గుండా సుధాకర్, జక్కు భూమేశ్, మధుసూదన్, రాజుకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు



రోడ్డు పక్కన చెట్ల పొదలు తొలగిస్తున్న పోలీసులు

హాజీపూర్, జూలై6 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ పోలీసు పరిధిలోని నర్సింగాపూర్ నుంచి వేంపల్లి వరకు జాతీయ రహదారి 63పై రోడ్డుకు ఇరు వైపుల ఉన్న ముళ్ల కంపలను చెట్ల పొదలను ఆదివారం తొలగించారు. రోడ్డు భద్రత చర్యలపై హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచన మేరకు రహదారి ప్రమాదాల నివారణ కోసం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో రోడ్డుకు ఇరువైపుల ఉ న్న ముళ్ల కంపలను తొలగించాలని తెలిపారు. వాహనదారులకు ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా రోడ్డు వెడల్పుకు కృషి చేస్తున్నట్లు తెలి పారు. వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు. ద్విచక్రవాహన దారు లు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించా రు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చేపట్టే కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిప ల్ కార్పొరేషన్ శానిటరి ఇన్స్‌పెక్టర్ వైకుంఠం, ఎఎస్ఐ చాంద్‌పాషా, పో లీసు సిబ్బంది బాల్త శ్రీనివాస్, శేఖర్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



పాదయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలో, మండలంలో తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా బీజేపీ నాయకులు పాండ రంగ విఠలేశ్వరుని పాదుకులు, చెంక చక్రాలతో శివాలయం నుంచి పాండు రంగ విఠలేశ్వరుని గుడి వరకు పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు తిరుపతి, సమ్మయ్య, శ్రీనివాస్, శంకర్, వ్యాపారవేత్త శంకర్ సోమాని, జనార్ధన్ పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

జన్నారం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దండేపల్లి : గూడెం శ్రీసత్యనారయణస్వామి దేవస్థానంతో పాటు మండలంలోని పలు దేవాలయాల్లో, భక్తుల ఇండ్లతో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఇళ్లలో భక్తులు చాతుర్మాస్య వ్రతాలను నిర్వహించారు. ఉదయం వేళ్ల గూడెం ప్రవిత గోదావరినదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించారు.

మంచిర్యాల కలెక్టరేట్ : తొలి ఏకాదశి పండగను ఆదివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశిని తొలి ఏకాదశిగా పేర్కొంటారని విశ్వనాథ ఆలయం ప్రధాన అర్చకుడు నరహరి శర్మ పేర్కొన్నారు. ఆలయంలో రుద్రాభిషేకం, తదితర పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయఈవో రవి, అర్చకులు భట్టాచార్య, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

దండేపల్లి జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపాడాలని దండేపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కోండు జనార్ధన్, గడ్డం రాంచందర్‌లు కోరారు. వన మహోత్సవంలో భాగంగా దండేపల్లిలో ఆదివారం లయన్స్ క్లబ్ నూతన భవనం వద్ద పలు రకాల మొక్కలు నాటారు. మొక్కలు పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు కాలుష్యం నుంచి రక్షించడమే కాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించగలుతామన్నారు. చెట్లతోనే పర్యావరణ కాపాడుకోగలుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ కెబి నెట్ చైర్మన్ మాదంశెట్టి మల్లిఖార్జున్, ఉపాధ్యక్షులు కొండు రామన్న, బొలిశెట్టి రాజన్న, సభ్యులు కర్రె నరేందర్, పొల్లంపల్లి శ్రీనివాస్, దర్శనాల గంగారం, ఎనగందుల సత్యం పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

మంత్రి వివేక్‌కు వినతిపత్రం అందించిన కాంగ్రెస్ నాయకులు

భీమారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నమొల్ల అశోక్, మంచాల మహేష్‌లు ఆదివారం కార్మికశాఖ మంత్రి వివేక్‌వెంక టస్వామికి వినతిపత్రం అందించారు. కొత్తపల్లిలో పాఠశాలభవనం, టాయి లెట్లు, మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని, మంచిర్యాల నుంచి చెన్నూరు వయా భీమారం, ఆరేపల్లి, మద్దికల్, కొత్తపల్లి, గంగారాం, సుద్దాల, కిష్టంపేట మీదుగా చెన్నూరుకు బస్సు నడిచేలా చూడాలని విన్నవించారు.

'ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడతా'

మంచిర్యాలక్రైం, జూలై6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని నిరుపేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడతానని మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు కటకం హరీశ్ అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు ఆర్యవైసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్ల రమేశ్, యువజన సంఘం అధ్యక్షులు బాల సంతోష్, వెంకటనర్సయ్యలు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వైశ్య సంఘ మహా సభ ఉపాధ్యక్షులు నల్మాస్ కాంతయ్య, నాయకులు శ్రీనివాస్, కొత్త వెంకటేశ్వర్లు, చిలువేరు వైకుంఠం, కెశెట్టి వంశీకృష్ణ, ఇరుకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన పెంచుకోవాలి

భీమారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : యువత నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని మంత్రి వివేక్ అన్నారు. సంవిధాన్ లీడర్‌షిప్ ప్రోగ్రాం వైట్ టీ షర్ట్ ఇనిషియేటివ్ కార్యక్రమం సందర్భంగా యువతలో రాజకీయం పట్ల అవగాహన పెంచడానికి నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నూరు క్యాంపు కార్యాలయంలో మెమెంటోలను మంత్రి వివేక్‌వెంకట స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ ఇలియా జుద్దీన్, రవితేజ, హరికృష్ణ శశిందర్, శివసాయి, చంద్రశేఖర్, రాజశేఖర్, సమ్మయ్య, చింతం సృజన్, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని వికాస్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్, చెన్నూరి సమ్మయ్య మాదిగలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ వర్మ, దశరథం, మల్లేష్, అంజన్న, రవికుమార్, రంజిత్‌కుమార్, శ్యామ్, నరేష్, సతీష్ మాదిగలు పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని బాలుర సాంఘీక సంక్షేమ వసతి గృహంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, నాయకులు వినోద్, వంశీ, వెంకటేష్, కుమార్, చారి, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాదిగ హక్కుల దండోర రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండుకూరి రాజు మాట్లాడుతూ జగ్జీవన్‌రాం అణగారిని వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లింగంపల్లి రాజలింగం, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీకాంత్, మండల ఎమ్మార్పీఎస్ కార్యదర్శి రవితో పాటు మండల నాయకులు ఎల్లయ్య, రమేశ్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి వివేక్‌వెంకటస్వామి



చెన్నూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ప్రొసిడింగ్స్ అందజేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతిలబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఆదివారం చెన్నూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్నారన్నారు. మైనింగ్ శాఖ మంత్రి అయ్యాక రికార్డులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో కేవలం ఇసుక రవాణా మీద రూ.600కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు పనిగట్టుకుని ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారని, ఇలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంచిర్యాల- చెన్నూరు రూట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన5 ఆర్టీసీ బస్సులను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ము రళీకృష్ణ, ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతి, ప్రజాపాలనే ప్రభుత్వ ధ్యేయం

కోటపల్లి : అన్నివర్గాల అభ్యున్నతి, ప్రజాపాలనే ప్రభుత్వ ధ్యేయమని కార్మికశాఖ, ఉపాధి, మైనింగ్‌శాఖల మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గోదాంల ఆవరణలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మంజూరు పత్రాల సభలో ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటికే మురుగుకాలువల నిర్మాణం, సీసీ రహదారుల నిర్మాణం పూర్తి చేశామని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందన్నారు. అనంతరం 429 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అంతకుముందు గోదాంల ఆవరణలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆ తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు శుద్దజలం అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ రాఘవేందర్‌రావు, సీఐ బన్సీలాల్, ఎస్ఐ రాజేందర్, మాజీ జెడ్పీటీసీ పోటు రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ ప్రసాద్, సింగిల్‌విండో మాజీ చైర్మన్, బాపురెడ్డి, నాయకులు ఆలూరి సంపత్, దుర్గం వెంకటస్వామి పాల్గొన్నారు.



కోటపల్లిలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి